క్లుప్తంగా

వేలానికి 45 వాహనాలు

చిత్తూరు రూరల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని 45 వివిధ వాహనాలను వేలం వేయనున్నట్లు అధికారులు చెప్పారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించి కాలపరిమితి దాటిన వాహనాలను వేలానికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో అధికారులు రమేష్‌బాబు, రాజేశ్వరరావు, ఇబ్రహీం, రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 23,850 డోసుల కోవిషీల్డ్

చిత్తూరు రూరల్: జిల్లాకు 23, 850 డోసుల కోవిషీల్డ్ వ్యాక్సిన్లు అందాయని డీఐఓ రవిరాజు తెలిపారు. బుధవారం చిత్తూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 60 ఏళ్ల పైబడిన వారికి బూస్టర్ డోస్ కింద వీటిని వేస్తామన్నారు. అలాగే యథావిధిగా వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. దీనిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కరపత్ర ప్రచారం చేస్తున్న రాధాకృష్ణ

పూతలపట్టు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌ను గెలిపించాలని ఆయన సోదరుడు రాధాకృష్ణ ప్రచారం చేసారు. బుధవారం మండలంలోని బండపల్లె, బైటపల్లె, తేనేపల్లె, పంచాయతీలలోని పట్టభద్రులను కలిసి కరపత్ర ప్రచారం చేశారు. పేర్నాటిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సాయి కృష్ణారెడ్డి, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం ఎంపిక

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీలో డిజిటలైజేషన్ ద్వారా పన్ను వసూళ్లకు పైలట్ ప్రాజెక్టుగా బంగారుపాళ్యం పంచాయతీ ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఒక పంచాయతీని ఎంపిక చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ పంచాయతీలో పీఓఎస్(పాయింట్ ఆఫ్ సేల్ డివైసెస్)మెషిన్ల ద్వారా పన్నులు వసూలు చేయనున్నారు. ఈ మేరకు త్వరలో మెషిన్ పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది.

27, 28న స్క్రీనింగ్ పరీక్ష, ఇంటర్వ్యూ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ విధానంలో వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27, 28వ తేదీల్లో స్క్రీనింగ్ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ జె. అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో బోర్ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, గార్డెనర్ పోస్టులకు గత నవంబర్‌లో దరఖాస్తుల ఆహ్వానించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27న (బోర్ ఆపరేటర్లు), 28న (కంప్యూటర్ ఆపరేటర్లు, గార్డెనర్, బోర్ ఆపరేటర్లకు) నగరపాలక కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి స్క్రీనింగ్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కమిషనర్ తెలియజేశారు.

జగనన్న లేఅవుట్ల పరిశీలన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: జగన్నన కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ గౌరి లబ్ధిదారులను కోరారు. బుధవారం ఆమె మండలంలోని యం.బండపల్లె జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఇళ్ల పనులు చేపట్టి పూర్తిచేయకుంటే రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తన కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలతో సమీక్షించారు.

ఉజ్వల భవితకు విద్యే తొలిమెట్టు



మంగళపల్లెలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: విద్యార్థుల ఉజ్వల భవితకు విద్యే తొలిమెట్టని ఆంధ్రా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణారెడ్డి అన్నారు. చదువుల తల్లి సరస్వతిదేవి జయంతి పురస్కరించుకుని బుధవారం మండలంలోని మంగళపల్లె జెడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే లక్ష్యాలను అధిగమిస్తారన్నారు. అనంతరం సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. మంగళవాణి మాసపత్రికకు తమ వంతు విరాళాన్ని అందజేస్తామన్నారు. 10వ తరగతిలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తామని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం పాలన దేశానికే ఆదర్శం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- పూతలపట్టు ఎమ్మెల్యే బాబు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప



మహాసముద్రంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఎంపీ రెడ్డెప్ప

బంగారుపాళెం: పేదల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. మండలంలోని మహాసముద్రంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడన్నరేళ్లలో ఆయా కుటుంబాలు ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ప్రజలు నివేదించిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారితోపాటు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడారు. సీఎం జగన్ అమలు చేసిన నవరత్న పథకాలు, గ్రామ సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లులేదన్నారు. మహాసముద్రంలో తాగునీటి సరఫరా కోసం 24 గంటలూ కరెంటు సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షర్మిల, మాజీ సర్పంచ్ శరత్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, వైస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్‌విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, కురబ, ఈడిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు అమరనాథ్, ఎల్లప్ప, ఎంపీటీసీ హిందుశేఖర్‌రెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, శరత్‌రెడ్డి, బీసీ నాయకుడు దొరస్వామి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, మండల పార్టీ కార్యదర్శి రఘుపతిరాజు, కో ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, పలువురు నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



● శాంతి.. క్రాంతి

74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా యాదమరి మండల ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ తన చిత్రాలతో ఆకట్టుకున్నారు. శాంతి..క్రాంతి, వేదనా శిఖరాలు– పేరిట సృజించిన ఈ చిత్రాలు మహిళామూర్తుల దృఢ సంకల్పాన్ని, శాంతిని, పోరాట తత్వాన్ని, స్వాతంత్ర్య సంగ్రామంలో బిడ్డలు, భర్తలు, అన్నదమ్ములను కోల్పోయిన మహిళల విషాదాన్ని ఈ చిత్రాల్లో ఆలోచనాత్మకంగా చిత్రించారు. –యాదమరి

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి



బుక్‌లెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

–చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి అందిస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఉదయం మండలంలోని చీలాపల్లె పంచాయతీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఇంటివద్దకే రేషన్, పింఛన్, ఇతర సంక్షేమ పథకాలు అందుతున్నాయా? వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకు వస్తున్నారా? అని ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించాలంటే మరోసారి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన తమ ప్రభుత్వం ఎంతగా చేస్తున్నా కబోదిలా ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. స్థానికులు మురుగు కాలువలు, రోడ్ల సమస్యలతోపాటు శ్మశానానికి దారి లేదని ఎమ్మెల్యే నివేదించారు. అనంతరం స్థానిక సచివాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, వైస్ చైర్‌పర్సన్ రమ్య, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్లు జనార్దన్, త్యాగరాజులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చెల్లాముత్తు, సంపత్, కోలా కిరణ్, రమణ, లారెన్స్, అశోక్, వెంకటేష్‌రెడ్డి, సాయి, శిలంబరసన్, రవి, క్రిష్ణ, రవీంద్రారెడ్డి, తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ ఉపేంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పౌర సరఫరా గోదాముల తనిఖీ



చిత్తూరు గోదామును పరిశీలిస్తున్న పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్

చిత్తూరు రూరల్: చిత్తూరులోని పౌరసరఫరాల గోదామును బుధవారం రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ మైసూర్ శ్రీనివాసమూర్తి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల సరఫరా..నిల్వలు ఇత్యాది వాటిపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. అలాగే బంగారుపాళ్యం , గంగాధర నెల్లూరు గోదాములను కూడా తనిఖీ చేశారు.

హైరిస్క్ కేసులు గుర్తించండి

చిత్తూరు రూరల్: జిల్లాలో హైరిస్క్ కేసులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందివ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి.ప్రకాశం ఆదేశించారు. బుధవారం చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో ఆయన వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. హైరిస్క్ కేసులను గుర్తించడంతో పాటు వారికి మంచి పౌష్టికాహార పదార్థాలను అందేలా చూడాలన్నారు. వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో అధికారులు శ్రీనివాసరావు, మీనాకుమారి, రేణుక ప్రభ పాల్గొన్నారు.

భూమిలేని ఎస్సీ, ఎస్టీలను గుర్తించండి

– జేసీ వెంకటేశ్వర్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్

బంగారుపాళెం: భూమిలేని దళిత, గిరిజనులను గుర్తించాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని కేజీ సత్రం, చీకూరుపల్లె, మహాసముద్రం గ్రామాలలో ఆయన పర్యటించారు. తొలుత కేజీ సత్రంలో దళితుల కోసం శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. శ్మశానానికి దారి కల్పించాలని, అలాగే దళితవాడలకు శ్మశాన స్థలాలను గుర్తించాలని తహసీల్దార్‌కు జేసీ సూచించారు. అనంతరం చీకూరుపల్లె, మహాసముద్రంలో అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చేందుకు భూమిని పరిశీలించారు. భూములు లేని దళితులు, గిరిజనులకు పట్టాలు ఇస్తామని, ఇప్పటి వరకు మండలంలో 110 ఎకరాలు గుర్తించామని, అందులో 15 మంది ఎస్సీలు, నలుగురు ఎస్టీలు, 37 మంది బీసీలు, 35 మంది ఓసీలు ఉన్నారని వెల్లడించారు. వీరితో పాటు మరి కొందరిని గుర్తిస్తామని జేసీకి తహసీల్దార్ వివరించారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పోలీస్ మైదానం 74వ గణతంత్ర వేడుకలకు ముస్తాబైంది. బుధవారం ఇక్కడ చేస్తున్న ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్, ఇతర అధికారులు పర్యవేక్షించారు. వేడుకల్లో వివిధ శాఖల శకటాలు ప్రదర్శిస్తారు. విధుల్లో ఉత్తమ పనితీరు కనబరచిన అధికారులకు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను ఇవ్వనున్నారు.

నేటి కార్యక్రమం ఇలా....

ప్రశాంత్ నగర్ వద్ద ఉన్న పోలీస్ పరేడ్ మైదానానికి ఉదయం 9 గంటలకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఆ తర్వాత కలెక్టర్ వస్తారు. జాతీయ పతాకావిష్కరణ, గౌరవందనం స్వీకరణ అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు. లబ్ధిదారులకు ఆస్తులు పంపిణీ చేస్తారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

పారిశుధ్య పనులకు ప్రాధాన్యత



39వ వార్డులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: నగరంలో పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర మేయర్ ఎస్.అముద ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం 39వ వార్డు పరిధిలో అమ్మన్ కోయిల్ వీధి, నేతాజీ వీధిలో మేయర్ పర్యటించారు. పారిశుధ్యం పనుల తీరును పరిశీలించారు. పలుచోట్ల మురుగునీటి కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. డెంగీ జ్వరాల నేపథ్యంలో పలు గృహాల వద్ద ఉన్న నిల్వ నీటిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎగువ తవణంపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



గర్భవతులను పరీక్షిస్తున్న వైద్యాధికారి ప్రియాంక

తవణంపల్లె: గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. బుధవారం ఎగువ తవణంపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. 120 మంది రోగులకు ప్రియాంక వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు క్రమం తప్పకుండా ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్లోనే ప్రసవం తల్లీబిడ్డకు క్షేమం అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయమ్మ, హరి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.2లక్షల విరాళం



విరాళమిస్తున్న నాగేశ్వర్ రావు, కృష్ణా జిల్లా వాసులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి రూ.2లక్షల విరాళం అందింది. బుధవారం ఉదయం కృష్ణా జిల్లా పామిడిముక్కలకు చెందిన ఏడుకొండలు కాణిపాకంలో నిత్యాన్నదానానికి రూ.లక్ష, అలాగే హైదరాబాద్‌లోని శేర్లింగపల్లెకు చెందిన నాగేశ్వర్‌రావు గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష చొప్పున విరాళాన్ని ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి అందజేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు, బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేశ భవితను మార్చేది ఓటు





బంగారుపాళెం: టేకుమంద జెడ్పీ హైస్కూల్‌లో.. ఐరాల: సీనియర్ సిటిజన్లకు సన్మానం



గుడిపాలలో..



పూతలపట్టులో..



తవణంపల్లెలో..

బంగారుపాళెం: దేశ భవితను మార్చే శక్తి ఓటు హక్కుకు ఉందని తహసీల్దార్ బెన్నురాజ్ అన్నారు. బుధవారం బంగారుపాళెంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్స వంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కును సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడేలా వినియోగించుకోవాలన్నారు. అలాగే టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ సుభాన్, ఉపాధ్యాయుడు వెంకటస్వామి ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటు అనంతరం విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐరాల: మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సుశీలమ్మ అన్నారు. బుధవారం ఎంఈఓ ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. విద్యార్థులతో కలిసి పురవీధుల్లో ఓటు హక్కు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: జాతీయ ఓటర్ల దినోత్సవంపై నరహరిపేట జెడ్పీ హైస్కూలు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. డెప్యూటీ తహసీల్దార్ కళ్యాణి మాట్లాడారు. హెచ్‌ఎం సబర్‌మతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత ప్రధానమైనదని నియోజకవర్గ ఈఆర్‌ఓ పర్వీన్ అన్నారు. పూతలపట్టు ప్రధాన కూడలి వద్ద పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్వీన్, తహసీల్దార్ విజయభాస్కర్ మాట్లాడారు. అరగొండ అపోలో విద్యార్థులు ఓటు ప్రత్యేకతను వివరించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, డీటీ మహేశ్వరి, ఎస్‌ఐ హరిప్రసాద్, హెచ్‌ఎం దామోదరం నాయుడు, అపోలో అధ్యాపకురాలు శోభారాణి, అధికారులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

తవణంపల్లె: తవణంపల్లె ఇన్‌చార్జి తహసీల్దార్ సుశీలమ్మ పిలుపు నిచ్చారు. స్థానిక హైస్కూల్ నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది కలసి ఓటర్ల నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆపై తవణంపల్లె హైస్కూల్లో సీనియర్ ఓటర్లను సత్కరించారు. టి.పుత్తూరులో వీఆర్‌ఓ రాజశేఖర్ టీచర్లు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సుశీలమ్మ డీటీ జయంతి, భూ రీసర్వే డీటీ వెంకటరమణ, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.